# సత్యవాక్యం

# THE WORD OF TRUTH

## క్రైస్తవ తెలుగు మాసపత్రిక

MAY - 2004

## సంక్షిప్త వార్తలు

2004 ఏప్రియల్ 3వ తేదీనాడు రామచంద్రపురం ఉట్రుమిల్లిలో రాత్రివేళ జరిగిన సువార్త కూటములో సోదరులు జాషువా గూటం గారు సతీసమేతముగా హాజరై వాక్యపరిచర్య చేసిరి. ఆ కూటములో రామచంద్రపురంలో సువార్త చేయుచున్న సోదరులు చిల్లా దేసింగ్ గారు, యన్. ప్రసాద్ గారు వారి స్థానిక సంఘ సభ్యులు హాజరై పాటలలోను, ప్రార్థన చేయుటలోను సహకరించిరి. ఉట్రుమిల్లిలో సోదరులు యు. యేసురత్నం గారు సువార్త చాటుచున్నారు.

ఏప్రియల్ 5వ తేదీ సాయంకాలము పిఠాపురం మంగాయమ్మ పేటలో జరిగిన సువార్త కూటములో సోదరులు జాషువా గారు పాల్గొని వాక్యపరిచర్య చేసిరి. ఇక్కడ హిందువుల మధ్య ముఖ్యముగా సోదరులు వై. పీటర్ (మిఠాయి అప్పారావ్) గారు పరిచర్య చేయుచున్నారు. వారికి సోదరులు యేసు రత్నం గారు (పిఠాపురం అగ్రహారం) అన్ని విషయాల సహకారము నందించు చున్నారు.

ఏప్రియల్ 6, 7 తేదీలలో పెద్దాపురం మండలం నాయకంపల్లిలో సువార్త కూటములు జరిగెను. నాయకంపల్లిలో నూతనముగా నిర్మించబడిన ఆలయములో ఈ కూటములు జరిగెను. ఆ కూటములకు స్థానికులు హాజరై ఆత్మీయముగా బలపడిరి. ఒక రోజున అనగా 7వ తేదీన జాషువా గారు ఆ కూటములో పాల్గొని వాక్య పరిచర్య చేసిరి. నాయకంపల్లిలోను, కాట్రావుల పల్లిలోను సోదరులు టి. ఆనందరావ్ గారు పరిచర్య చేయుచున్నారు.

ఏప్రియల్ 10వ తేదీ శనివారం అనపర్తి మండలం కొప్పవరంలో జరిగిన సువార్త కృతజ్ఞత కూటములో జాషువా గారు పాల్గొని వాక్యపరిచర్య చేసిరి. కొప్పవరంలో సోదరులు పి. రాజుగారు క్రీస్తు కొరకు ఆయన సంఘము కొరకు కష్టించి పనిచేయు చున్నారు. ఆ కృతజ్ఞత కూటమునకు స్థానికులు, రాజు దంపతుల బంధు మిత్రులు, పరిసర ప్రాంతముల నుండి వచ్చిన అనేక సువార్తికులు హాజరై పలు కార్యక్రమములలో పాల్గొనిరి. సోదరులు పి. వెంకట్రావు గారు అధ్యక్షత వహించి కార్యక్రమమును సమర్ధ

# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

P.O. Box-80, Kakinada, A.P. 533 001
Ph : 0884 - 2363722
Editor :
Joshua Gootam

*Pleading for Restoration of First Century Christianity*

సంపుటిక 24 — మే 2004 — సంచిక 10

## యేసుక్రీస్తు దేవుని కుమారుడని క్రైస్తవులు ఏల నమ్ముదురు? - 1

(Why Christians believe Jesus Christ is the Son of God)

యేసుక్రీస్తు దేవుడని, ఆయన ఆది అంతములు లేనివాడని, మానవులను పాపము నుండి విమోచించు నిమిత్తము మనుష్య రూపము దాల్చి ఆయన ఈ లోకమునకు వచ్చెనని ఇదివరకే మనము నేర్చుకొని యున్నాము. ఆయన దేవుని కుమారుడని లోకమందున్న క్రైస్తవులు ఎందుకు నమ్మెదురో, నీవు కూడ ఆయన దేవుని కుమారుడని ఎందుకు నమ్మవలెనో ఈరోజు తెలిసికొందాము.

యేసు ఒక కన్యకు జన్మించెను. యేసుక్రీస్తు జనన విధానమును మత్తయి అను భక్తుడు ఇట్లు వ్రాసెను: "ఆయన తల్లియైన మరియ యోసేపునకు ప్రధానము చేయబడిన తరువాత వారేకము కాకము నుపు ఆమె పరిశుద్ధాత్మవలన గర్భవతిగా ఉండెను. ఆమె భర్త అయిన యోసేపు నీతి మంతుడై యుండి ఆమెను అవమానపరచ నొల్లక రహస్యముగా ఆమెను విడనాడ నుద్దే శించెను. అతడు ఈ సంగతులను గూర్చి

ఆలోచించు కొనుచుండగా, ఇదిగో ప్రభువు దూత స్వప్న మందు అతనికి ప్రత్యక్షమై దావీదు కుమారుడవైన యోసేపూ నీ భార్య అయిన మరియను చేర్చుకొనుటకు భయ పడకుము. ఆమె గర్భము ధరించినది పరిశు ద్ధాత్మవలన కలిగినది. ఆమె యొక కుమా రుని కనును; తన ప్రజలను వారి పాపముల నుండి ఆయనే రక్షించును గనుక ఆయ నకు యేసు అను పేరు పెట్టుదు వనెను. ఇదిగో కన్యక గర్భవతియై కుమారుని కనును. ఆయనకు ఇమ్మానుయేలను పేరు పెట్టుదురు అని ప్రభువు తన ప్రవక్త ద్వారా పలికిన మాట నెరవేరునట్లు ఇదంతయు జరిగెను. ఇమ్మానుయేలను పేరునకు భాషాంతరమున దేవుడు మనకు తోడని అర్థము. యోసేపు నిద్రమేలుకొని ప్రభువు దూత తనకు ఆజ్ఞాపించిన ప్రకారము చేసి, తన భార్యను చేర్చుకొని ఆమె కుమారుని కనువరకు ఆమెను ఎరుగకుండెను; అతడు ఆ కుమారునికి యేసు అని పేరు పెట్టెను" (మత్తయి 1:18-25).

లూకా ఇట్లు వ్రాసెను: "గబ్రియేలను దేవదూత గలిలయలోని నజరేతను ఊరిలో యోసేపునకు ప్రధానము చేయబడిన కన్యయైన మరియ యొద్దకు వచ్చి, ఇదిగో నీవు గర్భము ధరించి కుమారుని కని ఆయనకు యేసు అను పేరుపెట్టుదువు; ఆయన గొప్పవాడై సర్వోన్నతుని కుమారుడ నబడును అని చెప్పెను. అందుకు మరియ - నేను పురుషుని ఎరుగనిదాననే; యిదేలాగు జరుగునని దూతతో అనగా దూత, పరిశుద్ధాత్మ నీమీదికి వచ్చును; సర్వోన్నతుని శక్తి నిన్ను కమ్ముకొనును గనుక పుట్టబోవు శిశువు పరిశుద్ధుడై దేవుని కుమారు డనబడును. దేవుడు చెప్పిన యేమాటయైనను నిరర్ధకము కానేరదని ఆమెతో చెప్పెను. అందుకు మరియ, ఇదిగో ప్రభువు దాసురాలను, నీ మాట చొప్పున నాకు జరుగుగాక అనెను" (లూకా 1:26-38).

"ఆ దినములలో సర్వలోకమునకు ప్రజాసంఖ్య వ్రాయవలెనని కైసరు ఔగుస్తు (Casesar Agustus) వలన ఆజ్ఞ ఆయెను.... అందరును ఆ సంఖ్యలో వ్రాయ బడుటకు తమ తమ పట్టణములకు వెళ్ళిరి. యోసేపు దావీదు వంశములోను గోత్రము లోను పుట్టినవాడు గనుక తనకు భార్యగా ప్రధానము చేయబడి గర్భవతియై యుండిన మరియతో కూడ ఆ సంఖ్యలో వ్రాయబడుటకు గలిలయలోని నజరేతు నుండి యూదయలోని బెత్లెహే మనబడిన దావీదు ఊరికి వెళ్ళెను. వారక్కడ ఉన్న ప్పుడు ఆమె ప్రసవ దినములు నిండెను గనుక తన తొలిచూలు కుమారుని కని,

పొత్తిగుడ్డలతో చుట్టి, సత్రములో వారికి స్థలము లేనందున ఆయనను పశువుల తొట్టిలో పరుండబెట్టెను" (లూకా 2:1-7).

"ఆ శిశువునకు సున్నతి చేయవలసిన యెనిమిదవ దినము వచ్చినప్పుడు గర్భమందాయన పడకమునుపు దేవదూతచే పెట్టబడిన యేసు అను పేరు వారు ఆయనకు పెట్టిరి" (లూకా 2:21).

లోకమందంతటా యున్న క్రైస్తవులందరు యేసుక్రీస్తు మానవుని కంటె మిన్నయైనవాడని, ప్రవక్త కంటె మిన్నయైనవాడని, ఆయన నిజముగా దేవుని అద్వితీయ కుమారుడని నమ్ముదురు. మనము మత్తయి లూకా అను భక్తులు వ్రాసిన సంగతులను క్రొత్త నిబంధనలో నుండి చదివి యుంటిమి. వాటిని బట్టి కన్యయైన మరియ ఒక పురుషునితో సంయోగించుట వలన గర్భవతి కాలేదు గాని, పరిశుద్ధాత్మని శక్తి ఆమెను కమ్ముకొనగా ఆమె యేసును తన గర్భమున ధరించెను అని గ్రహించితిమి. అందువలన యేసుక్రీస్తుకు భూసంబంధమైన తండ్రి లేడు. ఆయన తండ్రి దేవుడే. అందువలన ఆయన దేవుని కుమారుడే.

కన్యయైన స్త్రీ గర్భవతి ఎట్లు కాగలదు? అని కొందరు సందేహింప వచ్చును. అబ్రహాము, శారాల సంగతిని ఒకసారి మనము జ్ఞాపకము చేసికొందము. అబ్రహామునకు 100 సం॥లు శారాకు 90 సం॥లు వయస్సు వచ్చినప్పుడు, ఆమె గర్భవతియై ఒక కుమారుని కనును అని దేవుడు అబ్రహాముతో చెప్పగా శారా తనలో తాను నవ్వుకొనెను. అప్పుడు దేవుడు "యెహోవాకు అసాధ్యమైనది ఏదైనా ఉన్నదా?" అని వారిని ప్రశ్నించెను (ఆది. 18:24). అదే ప్రశ్నను నేను ఈరోజు మిమ్మును అడుగుచున్నాను..................... యెహోవాకు అసాధ్యమైనది ఏదైనా ఉన్నదా? ఈ జగత్తును అందలి సమస్తమును తన మాట ద్వారా కలిగించిన దేవుడు ఒక కన్యక ద్వారా తన కుమారుని ఈలోకమందు జనియింపజేయలేడా? అది దేవునికి ఏమైనను అసాధ్యమైనపనా? ఆయన ఈ లోకములో జీవము గల ప్రతివానికి తల్లియైన హవ్వను చేసెను. నిన్ను నన్ను చేసిన రీతిగనే ఆయన మరియను చేసెను. మరియను చేయగలిగిన దేవుడు ఆమెను గర్భము ధరింపజేయుట ఆయనకు అసాధ్యమైన పనా? అవును, కన్యయైన మరియను ఆయన తన పరిశుద్ధాత్మ శక్తిని బట్టి, అంటే మనుష్యుని శక్తిని బట్టి కాదుగాని, దేవుని శక్తిని బట్టి గర్భవతిగా చేసెను. అందువలననే "మనుష్యులకు అసాధ్యములైనవి దేవునికి సాధ్యములు" అని యేసు క్రీస్తు కూడ బోధించెను (లూకా

18:27). నెలలు నిండిన తరువాత మరియ తన తొలు చూలు కుమారుని కనెను. ఆయనే యేసుక్రీస్తు. దేవుని శక్తివలన ఆమె యేసును కనెను. గనుక ఆయన దేవుని కుమారుడని ప్రతి క్రైస్తవుడు నమ్మను. క్రైస్తవుడు కావలెనని కోరు ప్రతివాడు యేసు దేవుని కుమారుడని నమ్మవలెను. అట్లు నమ్మని యెడల మీరు మీ పాపములోనే మరణింతురని యేసు చెప్పెను (యోహాను 8:24).

"యేసుక్రీస్తు శరీరధారియై వచ్చెనని యే ఆత్మ ఒప్పుకొనునో అది దేవుని సంబంధమైనది; ఏ ఆత్మ యేసును ఒప్పుకొనదో అది దేవుని సంబంధమైనది కాదు". "మనము సత్యవంతుడైన వానిని ఎరుగవలెనని దేవుని కుమారుడు వచ్చి మనకు వివేక మనుగ్రహించి యున్నాడని యెరుగుదుము. మనము దేవుని కుమారుడైన యేసుక్రీస్తు నందున్న వారమై సత్యవంతుని యందున్నాము. ఆయనే నిజమైన దేవుడును నిత్యజీవమునై యున్నాడు" అని భక్తుడైన యోహాను క్రైస్తవులను హెచ్చరించెను (1 యోహాను 4:3; 5:20).

అంతేకాదు, యేసుక్రీస్తు ఈ లోకములో మనుష్య రూపమున ఉంటుండగా అనేకులు ఆయనే దేవుని కుమారుడు అని సాక్ష్యమిచ్చిరి. వారిలో కొందరి సాక్ష్యములు ఇప్పుడు గమనించుదాము :

మొట్టమొదటిగా గబ్రియేలను దేవదూత కన్యయైన మరియకు కన్పడి "పుట్టబోవు శిశువు పరిశుద్ధుడై దేవుని కుమారు డనబడునని" చెప్పెను (లూకా 1:35).

యేసుక్రీస్తు యోర్దాను నదిలో యోహాను చేత బాప్తిస్మము పొందిన వెంటనే నీళ్ళలో నుండి ఒడ్డునకు రాగా, తండ్రియైన దేవుడు "ఇదిగో ఈయనే నా ప్రియ కుమారుడు, ఈయన యందు నేనానందించుచున్నాను" అని ఆకాశము నుండి సాక్ష్యమిచ్చెను (మత్తయి 3:16, 17).

యేసుక్రీస్తు యెత్తయిన ఒక కొండ మీద రూపాంతరము పొందగా, మరియొక సారి తండ్రియైన దేవుడు, "ఇదిగో ఈయన నా ప్రియ కుమారుడు, ఈయన యందు నే నానందించుచున్నాను, ఈయన మాట వినుడి" యని సాక్ష్యమిచ్చెను (మత్తయి 17:1-5).

యేసుక్రీస్తు తనకుగా తాను అనేక సార్లు నేను దేవుని కుమారుడను అని సాక్ష్యమిచ్చుకొనెను : "సమస్తమును నా తండ్రి చేత నాకు అప్పగింపబడి యున్నది. తండ్రి గాక యెవడును కుమారుని ఎరుగడు; కుమారుడు గాకను, కుమారుడెవనికి

ఆయనను బయలు పరచనుద్దేశించునో వాడు గాకను మరి ఎవడును తండ్రిని ఎరుగడు" అని ఆయన బోధించెను (మత్తయి 11:27). యోహాను 5:17-25; యోహాను 9:30-38; 10-24-38; మత్తయి 26:63-64; మార్కు 14:60-62; లూకా 22:66-71 దయచేసి చదవండి.

యేసును చూచి దయ్యములు కూడ ఆయనే దేవుని కుమారుడని ఒప్పుకొనెను. లూకా 4:40-41లో ఇట్లు వ్రాయబడియున్నది: "సూర్యడస్తమించు చుండగా నానావిధ రోగముల చేత పీడింప బడుచున్న వారు ఎవరెవరి యొద్ద నుండిరో వారందరు ఆ రోగులను ఆయన యొద్దకు తీసుకొని వచ్చిరి; అప్పుడాయన వారిలో ప్రతివాని మీద చేతులుంచి వారిని స్వస్థ పరచెను. ఇంతేకాక దయ్యములును................ నీవు దేవుని కుమారుడవని కేకలు వేసి అనేకులకు వదలిపోయెను".

దయ్యములు పట్టిన మనుష్యులు యేసునకు ఎదురుగా వచ్చి - ఇదిగో దేవుని కుమారుడా, నీతో మాకేమి? కాలము రాకమునుపే మమ్మును బాధించుటకు ఇక్కడికి వచ్చితివా అని కేకలు వేసిరి యని మత్తయి 8:29లో వ్రాయబడియున్నది. యేసుక్రీస్తు యొక్క శిష్యులు ఆయన చేయుచున్న మహత్కార్యములను, అద్భుతములను చూచి "నీవు నిజముగా దేవుని కుమారుడవని చెప్పి ఆయనకు మ్రొక్కిరి" (మత్తయి 14:22-23).

బాప్తిస్మమిచ్చు యోహాను యేసు దేవుని అద్వితీయ కుమారుడని సాక్ష్యమిచ్చెను (యోహాను 1:15-18; 1:29-34).

నతనియేలను శిష్యుడు యేసును చూచి "బోధకుడా, నీవు దేవుని కుమారుడవు, ఇశ్రాయేలు రాజువు అని" ఒప్పుకొనెను (యోహాను 1:49). "నీవు సజీవుడగు దేవుని కుమారుడవైన క్రీస్తు" అని పేతురు యేసును గూర్చి ఒప్పుకొనెను (మత్తయి 16:16).

చివరగా యేసు సిలువమీద వ్రేలాడుచు బిగ్గరగా కేకవేసి తన ప్రాణము విడిచెను. వెంటనే దేవాలయపు తెర పై నుండి క్రిందికి చిరిగెను, భూమి వణకెను, బండలు బద్దలాయెను, సమాధులు తెరువబడెను, శతాధిపతియు, అతనితో కూడ యేసునకు కావలియున్న వారును ఈ కార్యములన్నిటిని చూచి మిక్కిలి భయపడి - నిజముగా ఈయన దేవుని కుమారుడని చెప్పుకొనిరి (మత్తయి 27:45-54).

దేవుని శక్తి వలన కన్యయయిన ఒక స్త్రీకి జన్మించుట ద్వారా యేసు దేవుని కుమారుడని మనం ఈరోజు తెలిసికొన్నాం.

యేసును శారీరకముగా ఎరిగిన వారిలో కొందరి సాక్ష్యములను ఇంతవరకు పరిశీలించాం. వారందరు యేసుక్రీస్తు దేవుని కుమారుడు అని మనకు నొక్కి వక్కాణించి చెప్పుచున్నారు. వచ్చే పాఠంలో మరికొన్ని ఋజువులను పొందుపర్చుచూ యేసుక్రీస్తు దేవుని కుమారుడని క్రైస్తవులు ఎందుకు నమ్ముదురో తెలిసికొందాము. మనము మోక్షాన్ని సాధించాలంటే, పుం అను నరకాన్నుండి తప్పించుకొనాలంటే దైవ పుత్రుడగు యేసు తప్ప మరియొకడు లేడని గ్రహించుదాం. దేవుని కుమారుని యందు విశ్వసించి ఆయనకు లోబడిన వాడే నిత్యజీవమునకు పాత్రుడు సుమా! (యోహాను 3:36).

✍ - జాషువా గూటం

# బైబిలు అద్భుతములు

(Bible Miracles)

అద్భుతములు అనగా యేమిటి? ఆదికాండము మొదటి అధ్యాయములో "ఆది యందు దేవుడు భూమ్యాకాశములను సృజించెను" అని కనబడతాది (ఆది.కా. 1:1). దేవుడు సృష్టిని జరిగించినప్పుడు దానిని నియంత్రించుటకు గాను చట్టములను లేక సూత్రములు నేర్పరచెను. ప్రతి జీవి తమ తమ జాతి ప్రకారము ఫలము నిచ్చుట, అభివృద్ధి జెందుట (ఆది.కా. 1:11, 12, 21, 24, 25), సూర్యుడు పగటి నేలుట, చంద్రుడు రాత్రి నేలుట (ఆది.కా. 1:16) మొదలగునవి అట్టి సూత్రములో కొన్ని ఈ సూత్రములు, ఇట్టి అనేక సూత్రముల వలన దేవుని సృష్టి అంతయు పరిపూర్ణ క్రమములో నడుచునట్లు దేవుడు వాటి నిచ్చెను. వీటినే మనం "ప్రకృతి సూత్రములు (The Laws of Nature) అంటాము.

దేవుడు ఆదిలో యిచ్చిన ప్రకృతి చట్టములు నేటికింకను అమలులోనే యున్నాయి. ప్రతి జీవరాశి తన జాతి ప్రకారమే అభివృద్ధి జెందుచున్నది. నేటికింకను పగటిని సూర్యుడును, రాత్రిని చంద్రుడును ఏలును. ఇంకా అనేక ప్రకృతి సూత్రములు దేవుడు ఆదిలో యిచ్చినట్లే నేటికిని పనిచేయు చున్నవి. వాటిలో ఎవ్విధమైన మార్పు లేదు.

అయితే కొన్ని సందర్భాలలో ఆయా కాలములలో పలు కారణముల వలన

దేవుడు తన ప్రకృతి చట్టమును ప్రక్కన బెట్టి కొన్ని సంఘటనలు జరిగించారు. ఈ సంఘటనలు ప్రకృతి చట్టమునకు అను గుణంగా యుండేవి కావు. అట్టిది ఏదైనా జరిగినప్పుడు దాన్ని "అద్భుతం" అని కరక్టు గానే మనం వర్ణిస్తాము. గనుక అద్భుతం అంటే, ప్రకృతి చట్టమునకు విరుద్ధముగా, అతీతంగా జరిగిన ఏదైనా ఒక సంఘటన. మరల ఏదైనా ఒక అసాధారణ సంగతి. ఎప్పుడో ఒకసారి జరిగే సంగతి, లేదా తరచు జరగని సంగతి ఏమైనా వుంటే అది అద్భుతం కాదు. భూకంపములు, తుఫానులు, సూర్య చంద్ర గ్రహములు మొదలగునవి తరచు జరుగక పోయినా అవి అద్భుత ములు కావు.

పాత క్రొత్త నిబంధనలలో జరిగిన అనేక అద్భుతముల వివరణ మనకున్నది. గొర్రెలు మేపు వాని చేతి కర్ర పాము ఆయెను. ఆ పాము మరల చేతి కర్రవలె మారెను (నిర్గమ 4:2-4). ఎర్ర సముద్రము రెండు పాయలగా చీలి మధ్యను ఆరిన నేల ఏర్పడెను. దాని గుండా జన సమూహములు ఆవలికి తరలిపోగల్గిరి (నిర్గ 14:21). ఒకని గొడ్డలి నీటిమీద తేలెను (2 రాజులు 6:5-6). కుష్ట రోగి ఒకడు యొర్దాను నదిలో ఏడు మారులు మునుగగా శుద్ధుడాయెను (2 రాజులు 5). ఒక విధవరాలి తొట్టిలో పిండి, బుడ్డిలో యున్న నూనె వాడుచున్న కొలది తరిగిపోలేదు (1 రాజులు 17:9-16). యివి కొన్ని ఉదాహరణలు. ప్రకృతి చట్టములకు అతీతంగా, భిన్నముగా వాటిని దేవుడు జరిగించాడు గనుక అవి అద్భుతములు.

యేసు ప్రభువు భూమి మీద యుండగా అనేక అద్భుత కార్యములు చేసారు. గలిలయ సముద్రముపై ఆయన తుఫానును అణచారు (మత్త 8:23-27). అయిదు రొట్టెలు రెండు చిన్న చేపలతో ఆయన అయిదు వేలమందికి ఆహారము పెట్టారు (యోహాను 6:1-13). పుట్టు గ్రుడ్డి వానికి ఆయన చూపునిచ్చారు (యోహాను 9). ప్రజలకున్న అనేక రకములైన రోగములు ఆయన బాగుచేసారు (మత్తయి 8:16). మూడు సందర్భాలలో చనిపోయిన వారిని ఆయన బ్రదికించారు (మత్త 9:18-26; లూకా 7:11-15; యోహాను 11). యివి సహజ సిద్ధమైన సంఘటనలు కావు. ప్రకృతిని చేసిన దేవుడు, ప్రకృతి సూత్రములను ఒక్కోసారి ప్రక్కన బెట్టి, ప్రకృతికి భిన్నమైనవి జరిగేలాగున చేసారు. యివి అద్భుతములు.

దేవుడు కొన్ని సందర్భాలలో తన ప్రకృతి చట్టమును ప్రక్కన బెట్టి అద్భుత కార్యములు ఎందుకు జరిగించారు? తాను చేసిన అద్భుతములను యేసు ఎందుకు

చేసారు? అపొస్తలులు కూడ ఎందువలన అద్భుతములు చేయగలిగారు? ఈ అద్భుతములు ప్రయోజనమును గూర్చి బైబిలు యేమి చెప్పుచున్నదో చూద్దాం.

అద్భుతముల ప్రయోజనం :

బైబిలులో మనం చదివే అద్భుతములో భౌతిక సంబంధమైన ఆశీర్వాదములు కలవనుటలో సందేహము లేదు. నయమాను యొక్క కుష్ట రోగం పోయింది. సారెపతు విధవరాలి యొక్క ఆహార సమస్య తీరింది, గ్రుడ్డివానికి చూపు లభించింది; మరియు మార్తలకు తమ సహోదరుడు సజీవుడై లభించాడు; అనేకులు తమ రోగముల నుండి విముక్తి పొందారు, యేసు శిష్యులు తుఫాను నుండి బయట పడ్డారు. అయితే యిట్టి భౌతిక ఆశీర్వాదములు కొరకే అద్భుతములు జరిగించ బడెనా? చూద్దాం.

యోహాను 20:30-31లో ఇట్లు చెప్పబడినది : "మరియు అనేకమైన యితర సూచక క్రియలను యేసు తన శిష్యుల యెదుట చేసెను. అవి యీ గ్రంధమందు వ్రాయబడి యుండలేదు గాని యేసు దేవుని కుమారుడైన క్రీస్తు అని మీరు నమ్మునట్లును, నమ్మి ఆయన నామమందు జీవము పొందునట్లును ఇవి వ్రాయబడెను".

యూదులఅధికారియైన నీ కొదేమను పరిసయ్యుడు యేసు నొద్దకు వచ్చి, "బోధకుడా నీవు దేవుని యొద్ద నుండి వచ్చిన బోధకుడవని మేమెరుగుదుము; దేవుడతనికి తోడై యుంటేనే గాని నీవు చేయుచున్న సూచక క్రియలను ఎవడును చేయలేడని చెప్పెను" (యోహాను 3:2). యేసు యొక్క మిత్రుడును మరియు మార్తల యొక్క సోదరుడగు లాజరు రోగియై యున్నాడనే వర్తమానము యేసు వినినప్పుడు తానున్న చోటనే యింక రెండు దినములు నిలచెను (యోహాను 11:6). లాజరు చనిపోయినప్పుడు యేసు తన శిష్యులతో, "మీరు నమ్మునట్లు నేనక్కడ ఉండలేదని మీ నిమిత్తము సంతోషించుచున్నాను" అని చెప్పెను (యోహాను 11:15). చివరకు యేసు చనిపోయిన లాజరు యొద్దకు వెళ్లు సరికి అప్పటికే.అతని శవము నాలుగు దినములు సమాధిలో యుండెను. గాని యేసు అతనిని సజీవునిగా లేపెను. "కాబట్టి ఆయన చేసిన కార్యమును చూచిన యూదులలో అనేకులు ఆయన యందు విశ్వాసముంచిరి" యని చెప్పబడింది (యోహాను 11:45).

అపొ.కా. 2:22లో యెరూషలేములో గుమిగూడిన జనసమూహముతో పేతురు ఇట్లు చెప్పెను: "ఇశ్రాయేలు వారలారా, యీ

మాటలు వినుడి, దేవుడు నజరేయుడగు యేసు చేత అద్భుతములను మహత్కార్యములను సూచక క్రియలను మీ మధ్య చేయించి మీకు కనబరచెను; ఇది మీరే యెరుగుదురు".

యేసు చేసిన సూచక క్రియల యొక్క ముఖ్య ఉద్దేశము ఆయన దేవుని కుమారుడని ప్రజలు నమ్మునట్లు అవి చేయబడెను. ఆయన తన్నుగూర్చి చెప్పుకొనుచున్నట్లు నిజముగా ఆయన దేవుని కుమారుడే యని ఆయన చేసిన అద్భుతములు ఋజువు పరచెనని యోహాను తెలియజేయు చున్నాడు. అద్భుతములు వాటి ప్రయోజనమును సంపూర్తి చేసెను. వాటివలన ప్రజలు విశ్వసించ గలిగిరి.

యేసు యొక్క అపొస్తలులు కూడ అద్భుతములు చేయగల్గిరి (అపో.కా. 3:1-11; 9:36-42; 14:8-10). అపొస్తలులు దేవుని వలన ఆమోదింప బడినవారని, పంపబడిన వారని, వారి వర్తమానము నిజముగా దేవుని వర్తమానము యని ప్రజలు విశ్వసించునట్లు అపొస్తలులు ద్వారా అద్భుతములు జరిగించబడెను.

మార్కు 16:15-18లో యేసు, తన శిష్యులు సర్వలోకమునకు వెళ్లి సర్వసృష్టికి సువార్త ప్రకటించాలని ఆజ్ఞాపించెను. వారు దయ్యములను వెళ్లగొట్టుదురని, క్రొత్త భాషలు మాటలాడుదురని, రోగులను స్వస్థపరచుదురని మొదలగు సూచక క్రియలు వారి వలన జరుగునని యేసు వారికి చెప్పెను. 20వ వచనములో, "వారు బయలు దేరి వాక్యమంతట ప్రకటించిరి. ప్రభువు వారికి సహకారుడై యుండి వెను వెంట జరుగుచు వచ్చిన సూచక క్రియల వలన వాక్యము స్థిరపరచు చుండెను, ఆమేన్" అని వ్రాయబడి యున్నది. హెబ్రీ 2:3-4లో, "ఇంత గొప్ప రక్షణను మనము నిర్లక్ష్యము చేసిన యెడల ఏలాగు తప్పించుకొందుము? అట్టి రక్షణ ప్రభువు బోధించుటచేత ఆరంభమై దేవుడు తన చిత్తానుసారముగా సూచక క్రియల చేతను, మహత్కార్యముల చేతను నానా విధములైన అద్భుతముల చేతను విధములైన పరిశుద్ధాత్మ వరములను అనుగ్రహించుట చేతను వారితో కూడ సాక్ష్యమిచ్చు చుండగా వినిన వారి చేత మనకు ధృడపరచబడెను" అని చెప్పబడెను.

గనుక వాక్యమును స్థిరపరచుటకు, ధృడపరచుటకు అద్భుతములు చేయబడెను. వాక్యము స్థిరపరచబడి గ్రంథస్థము చేయబడి మనకీయబడింది.

కొందరు నేడు కూడ అద్భుతములు చేయుచున్నట్లు చెప్పుకొనుచున్నారు. అట్లయితే వారు నిజంగా చేస్తున్నారా? వారు

అద్భుతములు చేయుచున్నట్లు నీవను కొనుచున్న యెడల నిన్ను నీవే దిగువ రీతిగా ప్రశ్నించుకో :

1. యిది నిజంగా అద్భుతం అని చెప్పగలిగే అద్భుతాన్ని నేనెన్నడయినా చూచానా?

2. ఎవడైనా తుఫానును గద్దించి దానిని ఆపడం ఎన్నడైనా చూసానా?

3. నేనెరిగిన పుట్టు గ్రుడ్డివాడు ఎన్నడయినా అద్భుత రీతిగా చూపు పొందుట చూసానా?

4. నలుబది సంవత్సరముల మట్టుకు నేనెరిగిన కుంటివాడెవడైనా అద్భుత రీతిగా స్వస్థపరచబడుట చూసానా?

5. చనిపోయిన నాలుగు దినముల మట్టుకు సమాధిలో యున్నవాడు తిరిగి లేప బడుట ఎన్నడైనా చూసానా?

యేసును ఆయన అపొస్తలులును అనేక జనసమూహముల యెదుట అద్భుతములు చేసారు. వారు కండ్లారా చూసారు, దేవుని మహిమ పర్చారు. అవి నిజంగా అద్భుతములని ఆ ప్రజలకు తెలుసు. అయితే అట్టి ఋజువులేమీ నేడు కొందరు జరిగించుచున్న అద్భుతములకు లేనే లేవు.

యేసు చెప్పిన అద్భుతముల ద్వారా ప్రజలాయన యందు విశ్వాస ముంచునట్లు వాటి రికార్డు గ్రంధములో మనకున్నది. క్రొత్త నిబంధనలో అపొస్తలుల యొక్క మాటలు అద్భుత రీతిగా అందించబడి దృఢపర్చబడ్డాయి. అద్భుతముల యొక్క ప్రయోజనం - యేసు దేవుని కుమారుడని నిరూపించడానికి, ఆయన చిత్తాన్ని బయలు పర్చడానికి, దాన్ని ధృఢపర్చడానికి, ఇవన్నీ సంపూర్తి చేయబడ్డాయి. అందువలన అద్భుతముల యొక్క ప్రయోజనం నేడు లేదు.

1 కొరింధీ 13:8-10లో అపొ.పౌలు "పూర్ణమైనది వచ్చినప్పుడు" అద్భుతములు అంతమవుతాయని చెప్పాడు. "అయితే స్వాతంత్ర్యము నిచ్చు సంపూర్ణమైన నియమములో తేరి చూచి నిలుకడగా ఉండువాడెవడో వాడు విని మరచువాడు కాక క్రియను చేయువాడై యుండి తన క్రియలో ధన్యుడగును" అని యాకోబు క్రొత్త నిబంధనను గూర్చి చెప్పాడు (యాకోబు 1:25). "పూర్ణమైనది వచ్చినప్పుడు అనగా సంపూర్ణమైన క్రొత్త నిబంధన వచ్చేసింది. అది క్రీస్తు యొక్క సంపూర్ణ నియమము, క్రొత్తనిబంధన (యోహాను 16:12-13; 2 పేతురు 1:3). అది ఒక్కమారే (Once for all) అప్పగింప

బడింది (యూదా : 3). నేడు ప్రజలు దానిలోకి తేరి చూచి దేవుని చిత్తాన్ని, ఆయనతో యుండుటకు నిత్య జీవ మార్గాన్ని తెలిసికొనగలను.

✍ - ఎ. ఎ. మార్క్

❀ ❀ ❀

# క్రీస్తు యేసునందు దీవెనలు

## (Blessings in Christ Jesus)

క్రీస్తు యేసునందుండు వాడు క్రైస్తవుడు. "కాగా ఎవడైనను క్రీస్తునందున్న యెడల వాడు నూతన సృష్టి: పాతవి గతించెను, ఇదిగో క్రొత్తవాయెను" (2 కొరింధి 5:17). "క్రీస్తునందున్న యొక మనుష్యుని నేనెరుగుదును. అతడు పదునాలుగు సంవత్సరముల క్రిందట మూడవ ఆకాశమునకు కొనిపోబడెను" (2 కొరింధి 12:2).

యేసుక్రీస్తు ద్వారా దేవునితో సరియైన సంబంధము కలిగి యుండిన వారికి మాత్రమే ఆత్మీయ ఆశీర్వాదములు వచ్చును. తన సిలువ వలన ఆ ద్వేషమును సంహరించి, దాని ద్వారా వీరిద్దరిని ఏక శరీరముగా చేసి, దేవునితో సమాధాన పరచవలెనని ఈలాగు చేసెను. గనుక ఆయనయే మనకు సమాధానకారుకుడై యున్నాడు (ఎఫెసీ 2:16). క్రీస్తు ప్రభువు నందున్న వారు అనుభవించగలిగే కొన్ని దీవెనలు :-

క్రీస్తునందు క్షమించబడుట అనే దీవెన : "పేతురు - మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు బాప్తిస్మము పొందుడి అప్పుడు పరిశుద్ధాత్మ అనువరము పొందుదురు" (అపొ.కా. 2:38) అని చెప్పెను. "ఆయన వెలుగులో యున్న ప్రకారము మనమును వెలుగులో నడిచిన యెడల, మనము అన్యోన్య సహవాసము గలవారమై యుందుము; అప్పుడు ఆయన కుమారుడైన యేసు రక్తము ప్రతి పాపమునుండి మనలను పవిత్రులనుగా చేయును" (1 యోహాను 1:7). యేసు రక్తము ప్రతి ఒక్కరిని పవిత్రులనుగా చేయును. పవిత్రులుగ నిలువబెట్టును. వెలుగులో నడచుటకు తోడ్పడును.

క్రీస్తుయేసునందు సమాధానమనే దీవెన : క్రీస్తు నందుండక వేరుండువాడు దేవునికి విరోధి. "వ్యభిచారిణులారా, ఈ లోక స్నేహము దేవునితో

వైరమని మీరెరు గరా? కాబట్టి యెవడు ఈ లోకముతో స్నేహము చేయగోరునో వాడు దేవునికి శత్రువగును" (యాకోబు 4:4). అనవసర ప్రదేశములన్నిటి యందును సమాధానము కొరకు ప్రపంచము చూచు చున్నది. అయితే నిజమైన సమాధానము క్రీస్తు నందు మాత్రమే గలదు. యేసు ప్రభువు ద్వారానే దేవునితో సమాధానము పొందగలము. కాబట్టి విశ్వాస మూలమున మనము నీతిమంతులముగా తీర్చబడి, మన ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా దేవునితో సమాధానము కలిగియుందము (రోమా 5:1).

**క్రీస్తునందు సిద్ధపాటు యొక్క ఆశీర్వాదము :-** ఎవరు సిద్ధపడి యుందురో అట్టివారికి మాత్రమే నిత్యము నిలుచునట్టి ఆనందము కలుగును. "నేనిప్పుడే పానార్పణముగ పోయబడు చున్నాను. నేను వెడలిపోవు కాలము సమీపమై యున్నది. మంచి పోరాటము పోరాడితిని, నా పరుగు కడముట్టించితిని, విశ్వాసము కాపాడుకొంటిని. ఇక మీదట నాకొరకు నీతి కిరీటముంచబడి యున్నది. ఆ దినమందు నీతిగల న్యాయాధిపతియైన ప్రభువు అది నాకును, నాకు మాత్రమే కాకుండ తన ప్రత్యక్షతను అపేక్షించువారి కందరికిని అనుగ్రహించును" (2 తిమోతి 4:6-8). క్రీస్తు యేసునందుండిన ప్రతి వ్యక్తికి మరణము కొరకైన సిద్ధపాటు ఒక దీవెన కరముగ యుండును.

క్రీస్తు యేసునందుండని వ్యక్తి మరణము కొరకైన సిద్ధపాటు గాని, లేక నిత్యజీవమును గూర్చిన వాగ్దానముగాని లేక తన శ్రమలను తానే భరించుకొన వలెను. క్రీస్తునందుండునట్లు సువార్త విన వలెను. "వినుటవలన విశ్వాసము కలుగును; వినుట క్రీస్తును గూర్చిన మాటవలన కలుగును" (రోమా 10:17). "మరియు సహోదరులారా, నేను మీకు ప్రకటించిన సువార్తను మీకు తెలియబరచు చున్నాను. మీరు దానిని అంగీకరించితిరి, దానియందే నిలిచి యున్నారు. మీ విశ్వాసము వ్యర్థమైతేనేగాని, నేను యే ఉపదేశరూపముగా సువార్త మీకు ప్రకటించితినో ఆ ఉపదేశమును మీరు గట్టిగా పట్టుకొనిన యెడల, ఆ సువార్త వలననే మీరు రక్షణ పొందువారై యుందురు" (1 కొరింధి 15:1-2). రక్షణ పొందునట్లు మారుమనస్సు పొందవలెను; అనగా పాపముల విషయమై పశ్చాత్తాపము (అ.కా. 2:38, 17:30) పొంది పాపక్షమాపణ నిమిత్తము యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందవలెను. మనుష్యుల యెదుట నన్ను ఒప్పుకొనువాడెవడో పరలోక మందున్న నా తండ్రి యెదుట నేనును వానిని ఒప్పుకొం

దును (మత్తయి 10:32, రోమా 10:9-10). క్రీస్తు యేసులోనికి బాప్తిస్మము పొందిన మనమందరము ఆయన మరణములోనికి బాప్తిస్మము పొందితిమని మీరెరుగరా? (రోమా 6:3, గలతి 3:27). క్రీస్తు నందు విశ్వాసము గల ప్రతి వ్యక్తి మరణము కొరకైన సిద్ధపాటును నిత్యజీవము కొరకైన వాగ్దానమును, శ్రమల యందు ఆదరణ, సహాయము, నిరీక్షణ కలిగి యుండును.

ఆత్మీయంగా నీవు యెచ్చుట ఉన్నావు? క్రీస్తునందుంటివా? క్రీస్తు యేసు నందున్న వారు సంఘమనే ఆయన శరీర ములో యున్నారని క్రొత్త నిబంధన బోధించుచున్నది. సంఘము అను శరీరము నకు ఆయనే శిరస్సు. క్రీస్తు అనుగ్రహించు సమాధానము మీ హృదయములలో వెలుగు చుండనియ్యుడి. ఇందుకొరకే మీరొక్క శరీరముగా పిలువ బడితిరి (కొలస్సీ 1:18, 3:15).

✍ - చార్ల్స్ బాక్స్

# సంఘము, ఆత్మీయ ఇశ్రాయేలు

## (The Church, Spiritual Israel)

పాతనిబంధన కాలమంతయు, అంటే పితరుల యుగము, మోషే యుగ ముల కాలమంతయు మెస్సీయ రాకకు ఉపోద్ఘాతమువలె యున్నది. పితరుల యుగంలో దేవుడు అబ్రాహామును యాకోబును తన సేవకులుగా నుండుటకు పిలిచెను. వారి ద్వారా దేవుడు తన కొరకొక జనాంగమును నెలకొల్పుటకు నిశ్చయించు కొనెను. ఈ జనాంగమును 'ఇశ్రాయేలు' అని పిలుచుటకు ఆయన కిష్టమాయెను. ఆ పేరును ఆయన యాకోబుకిచ్చెను. మోషే యుగంలో దేవుడు తాను ఏర్పరచు కొనిన జనాంగమునకొక ధర్మశాస్త్రము నిచ్చెను. సీనాయి కొండపై దానిని ఆయన మోషేకు బయలుపరచెను. వారాయనను ఆరాధిస్తు ఆయన కొరకు పరిశుద్ధ జనాంగ ముగ జీవించాలని వారికి ఉపదేశించెను. అయినను పాతనిబంధన కాలములో దేవుని క్రియలన్నియును కాలము పరిపూర్ణ మైనప్పుడు మెస్సీయాను ఈ లోకము లోనికి తీసికొని వచ్చుటకు చేయబడిన ఏర్పాటులలో భాగమై యున్నవి. నిజానికి పాతనిబంధన అంతయు ఒక జనాంగము యొక్క కథనమైతే, క్రొత్త నిబంధన అంతయు ఒక వ్యక్తి యొక్క వృత్తాంతమై యున్నది.

అందువలననే ప్రభువు యొక్క సంఘమును అపొ.పౌలు "దేవుని ఇశ్రాయేలు" అని పిలువగలిగాడు. ఇందులో ఆశ్చర్యము లేదు. "ఈ పద్ధతి చొప్పున నడుచుకొను వారి కందరికి, అనగా దేవుని ఇశ్రాయేలునకు సమాధానమును కృపయు కలుగును గాక" అని అతడు వ్రాసాడు (గలతీ 6:16). అంతేకాదు పాతనిబంధన సంబంధముతో సంఘమును పౌలు అందుకే అలంకార రీతిగా పోల్చి చెప్పాడు. "ఎందుకనగా శరీరమును అస్పదము చేసి కొనక దేవునియొక్క ఆత్మవలన ఆరాధించుచు, క్రీస్తు యేసునందు అతిశయ పడుచున్న మనమే సున్నతి ఆచరించు వారము" (ఫిలిప్పీ 3:3). సంఘమును ఆత్మీయ ఇశ్రాయేలు అని పిలుచుట విశిష్టమైనది. ఏలయనగా నాడు ఇశ్రాయేలీయులు దేవునికి ఎట్లు ప్రత్యేకింప బడిరో నేడు క్రీస్తు సంఘము అట్లు ప్రత్యే కింప బడినది.

సంఘము 'క్రొత్త నిబంధన ఇశ్రాయేలు' అని నొక్కి చెప్పు లేఖన భాగము 1 పేతురు 2:9, 10. క్రైస్తవుడై యుండుటలో గల భావమును పేతురు 1 పేతురు 1:22-2:10 వరకున్న లేఖనాల్లో తెలియజేసాడు. అతడు క్రైస్తవ మార్పును గూర్చి (1:22-25), క్రైస్తవ ప్రవర్తనను గూర్చి (2:2, 3), క్రైస్తవ పిలుపును గూర్చి (2:4-10) చెప్పాడు. క్రైస్తవులు దేవుని ప్రత్యేక జనాంగము, ఆయన ఏర్పరచుకొనిన నిజమైన ఇశ్రాయేలు గనుక క్రైస్తవుడు ఆనందించాలని అతడు చెప్పాడు. "అయితే మీరు చీకటిలో నుండి ఆశ్చర్యకరమైన తన వెలుగులోనికి మిమ్మును పిలిచినవాని గుణాతిశయములను ప్రచురము చేయు నిమిత్తము, ఏర్పరచబడిన వంశమును, రాజులైన యాజక సమూహమును పరిశుద్ధ జనమును దేవుని సొత్తయిన ప్రజలునై యున్నారు" (1 పేతురు 2:9).

## ఏర్పరచబడిన వంశము

క్రైస్తవులు ఆత్మీయ ఇశ్రాయేలు అని వర్ణించుటలో, వారు ఏర్పరచబడిన వంశమని పేతురు చెప్పాడు. వారు ఏర్పరచబడినారు, ఎన్నుకోనబడినారు, ప్రత్యేకింపబడినారు. ఈ లోకములో యున్నవారందరిలో నుండి దేవుని వలన ప్రత్యేకముగా పిలువబడినవారు.

సీనాయి వద్ద ఇశ్రాయేలీయులకు మోషే ద్వారా దేవుడు, "నీవు నీ దేవుడైన యెహోవాకు ప్రతిష్టిత జనము, నీ దేవుడైన యెహోవా భూమి మీద నిన్ను సమస్త జనముల కంటె నిన్ను ఎక్కువగా ఎంచి, నిన్ను తనకు స్వకీయ జనముగా ఏర్పరచుకొనెనె" అని చెప్పెను (ద్వితీ 7:6). "కాగా మీరు నామాట శ్రద్ధగా విని నా నిబంధన

ననుసరించి నడచిన యెడల మీరు సమస్త జనులలో నాకు స్వకీయ సంపాద్యమగుదురు" (నిర్గమ 19:5).

అయితే మానవ చరిత్ర యొక్క అంతిమ యుగంలో శారీరక ఇశ్రాయేలు కాదుగాని, క్రైస్తవులే దేవుని యొక్క ఏర్పరచబడిన వంశము. పురాతన ఇశ్రాయేలు నూతన ఇశ్రాయేలుకు నాంది. అది నూతన ఇశ్రాయేలులో నెరవేర్చబడింది. అట్లు జరుగుటకు గాను దేవుడు ముందుగానే నిర్ణయించెనని పౌలు చెప్పాడు: "ఎట్లనగా తన ప్రియుని యందు తాను ఉచితముగా మనకనుగ్రహించిన తన కృపా మహిమకు కీర్తి కలుగునట్లు తన చిత్త ప్రకారమైన దయాసంకల్పము చొప్పున, యేసుక్రీస్తు ద్వారా తనకు కుమారులనుగా స్వీకరించుటకై మనలను ముందుగా తన కోసము నిర్ణయించుకొని... జగత్తు పునాది వేయబడకమునుపే ప్రేమచేత ఆయన క్రీస్తులో మనలను ఏర్పరచు కొనెను" (ఎఫెసీ 1:4-5).

తమకున్న శ్రేష్టమైన తలాంతులు, అందము, జ్ఞానము, ధనాన్ని బట్టి క్రైస్తవులు దేవునికి ఏర్పరచబడిన వంశము కాదుగాని దేవుడు మనలను ప్రేమించి నందువలనను, విశ్వాసము ద్వారా ఆయన చిత్తమునకు లోబడి ఆయన బిడ్డలమైనందుననే మనం ఆయన సంఘమైతిమి. దేవునితో మనకున్న సంబంధము మనకున్న డబ్బునుబట్టి గాక ఆయన కనికరము వలననే సాధ్యమాయెను. "ఒకప్పుడు కనికరింప బడక యిప్పుడే కనికరింపబడితిరి" (1 పేతురు 2:10). "మనము నీతి ననుసరించి చేసిన క్రియల మూలముగాకాక, తన కనికరము చొప్పుననే పునర్జన్మ సంబంధమైన స్నానము ద్వారాను, పరిశుద్ధాత్మ మనకు నూతన స్వభావము కలుగజేయుట ద్వారాను మనలను రక్షించెను" అని పౌలు చెప్పాడు (తీతు 3:5). మనం బాప్తిస్మము పొందినప్పుడు దేవుని కనికరము పొంది ఆయన ఏర్పరచు కొనిన వంశమైతిమి. గనుక దేవునికి స్తోత్రము!

## రాజులైన యాజక సమూహము

క్రీస్తు సంఘము రాజులైన యాజక సమూహమై యున్నది. నేడు క్రైస్తవులందరు దేవునికి యాజకులు. ఒక సమూహముగా వారందరు ఒక యాజక రాజ్యమై యున్నారు. పాతనిబంధన కాలములో లేవీయుల యాజకత్వము ద్వారా దేవుడు తన ప్రజలకు మార్గ మేర్పరచెను. అబ్రాము కుటుంబీకులను లేవీ గోత్రీకులను ఆయన యాజకులుగా ఏర్పరచుకొనెను. ప్రజల యొక్క బలులను వారర్పించిరి. మోషే ధర్మశాస్త్రము చొప్పున వారు ఇశ్రాయేలీయుల ఆరాధన నంతయును జరిగించిరి. దేవుడు లేవీయులకు, "ఇశ్రాయేలీయుల

మధ్యను నీ పాలు నీ స్వాస్థ్యము నేనే" యని చెప్పెను (సంఖ్యా 18:20). లేవీయులకు దేవుని ఆరాధించుట లోను, పరిచర్య చేయుటలోను ప్రత్యేక స్థాన మీయబడెను. దేవుని సమీపించుటకును ఆయనతో సన్నిహిత సంబంధము కలిగి యుండుటకును వారికి తరుణమీయబడెను.

ఇప్పుడు లేవీ యాజకత్వము అమలులో లేదుగాని దేవుడొక నూతన యాజక సమూహమును ఏర్పరచుకొని యున్నాడు. క్రీస్తు యొక్క విమోచన సంకల్పము వలన ఆయన తన సంఘమును క్రైస్తవ యుగములో యాజకులుగా ఏర్పరచుకొని యున్నాడు. దేవుడు తన సంఘమును యాజకులనుటయే గాక వారు రాజులైన యాజకులని పిలుచు యున్నాడు. సంఘము యాజకుల సామ్రాజ్యము లేదా రాజులైన యాజకులు. "ఆయన మనలను తన తండ్రి యగు దేవునికి ఒక రాజ్యముగాను యాజకులుగాను జేసెను" (ప్రక 1:6). "యేసు క్రీస్తు ద్వారా దేవునికి అనుకూలములగు ఆత్మసంబంధ్మమైన బలుల నర్పించుటకు పరిశుద్ధ యాజకులుగా ఉండునట్లు మీరును సజీవ మైన రాళ్ళవలె నుండి ఆత్మ సంబంధమైన మందిరముగా కట్టబడు చున్నారని" అపొ. పేతురు వ్రాసాడు (1 పేతురు 2:5). పరిశుద్ధాత్మ్మని సహాయము వలన, మన మధ్యవర్తియు ప్రధాన యాజకుడునైన క్రీస్తు ద్వారా క్రైస్తవుడు నేరుగా దేవుని సమీపింప వచ్చును. అతడు మానవ యాజకుని ద్వారా గాక, నేరుగా క్రీస్తు ద్వారా దేవుని సమీపింప వచ్చును.

యాజకుడు ఒక వంతెన వంటివాడు. మూల భాషయైన లాటిన్‌లో ఆ పదమునకున్న భావమదియే. పాతనిబంధనలో లేవీ యాజకుడు మానవునికి దేవునికి మధ్యనున్న ఆత్మీయ వంతెనవంటివాడు. దేవుడు యాజకుని ద్వారా ప్రజలను సమీపించేవాడు. ప్రజలు యాజకుని ద్వారా దేవుని సమీపించేవారు. క్రైస్తవ యుగంలో యిదెంత వ్యత్యాసమో! ఒకడు క్రైస్తవుడు కాగానే, ఆ క్షణంలోనే అతడు దేవుని యాజకుడౌతాడు. మనం దేవుని యాజకులమనే సత్యాన్ని బట్టి ఆయన సహవాసంలో జీవించుటకు శ్రద్ధ కలిగి యుండాలి. మనము రాజులైన యాజకులమైనందుకు స్తోత్రము !

### పరిశుద్ధ జనము

క్రీస్తు సంఘము ఒక పరిశుద్ధ జనమై యున్నారు. అలంకార రీతిగా చెప్పాలంటే, సంఘము దేవుని జనాంగమై యున్నారు. ఆయన కొరకు ప్రత్యేకింపబడిన ప్రజలై యున్నారు.

దేవుడేర్పరచుకొనిన జనాంగముగా ఇశ్రాయేలీయుల పరిశుద్ధులుగా యుండుటకు పిలువబడిరి. మోషే ద్వారా దేవుడు ఇశ్రాయేలీయులకు, "మీరు పరిశుద్ధులై యుండవలెను. మీ దేవుడైన యెహోవానగు నేను పరిశుద్ధుడనై యున్నాను" అని తెలియజేసెను (లేవీ 19:2). "మీరు నాకు యాజక రూపకమైన రాజ్యముగాను పరిశుద్ధమైన జనముగాను ఉందురని" ఆయన చెప్పెను (నిర్గమ 19:6). దేవుడిచ్చిన ఈ పిలుపును మనసులో నుంచుకొని పేతురు ఇట్లు వ్రాసాడు : "నేను పరిశుద్ధుడనై యున్నాను గనుక మీరును పరిశుద్ధులై యుండుడని వ్రాయబడి యున్నది. కాగా మీరు విధేయులగు పిల్లలై............... సమస్త ప్రవర్తయందు పరిశుద్ధులై యుండుడి" (1 పేతురు 1:14-16).

దేవుని జనాంగమైన క్రైస్తవులు దేవుని వలె యుండాలి. ఆయన పరిశుద్ధుడు, మనమును పరిశుద్ధులమునై యుండాలి. మనము ఆయన ప్రియులైన పిల్లలవలె ఆయనను అనుకరిస్తు మన క్రియలలోను వ్యక్తిత్వములోను ఆయనను ప్రతిబింబింపజేయాలి (ఎఫెసీ 5:1, 2). 'పరిశుద్ధత' అను మాటకు ఒక పవిత్రమైన పని కొరకు ప్రత్యేకింపబడుటయని అర్థము. యిది క్రైస్తవులకు వర్తించునపుడు దేవుని ప్రజలు ఆయనకు అవిభాజ్యమైన భక్తి, ఆరాధన, పరిచర్య జరుపుటకు ప్రత్యేకింపబడిన వారని యర్థము.

క్రైస్తవునికి రెండు జనాంగములలో పౌరసత్వము కలదు. అతడు జీవించు దేశములో మొదటిది. అతడు సమర్పించుకొనిన జనాంగములో రెండవది కలదు. ఈ లోకంలో ఏదో ఒక దేశ పౌరుడుగా అతడు జీవిస్తూ యుంటాడు గాని అతని అంతిమ పౌరసత్వము పరలోకంలో యుంటాది. "మన పౌరస్థితి పరలోకము నందున్నది; అక్కడ నుండి ప్రభువైన యేసుక్రీస్తు అను రక్షకుని నిమిత్తము కనిపెట్టుకొని యున్నాము" (ఫిలిప్పీ 3:20). క్రైస్తవులు దేవుని పరిశుద్ధ జనమై యున్నారని గుర్తుంచుకొంటే, వారు పవిత్రమైన జీవితమును జీవించుట దుర్లభము కాదు. మనము పరిశుద్ధ జనమై యున్నందుకు దేవునికి స్తోత్రము !

## దేవునికి సొత్తయిన ప్రజలు

క్రైస్తవులు దేవుని సొత్తయిన ప్రజలై యున్నారని పేతురు చెప్పాడు. అంటే క్రైస్తవులు దేవుని స్వకీయమైన ఆస్థియై యున్నారని దీని భావం. వారాయనకు చెందినవారు. అందువలననే వారు దేవుని సొత్తు.

మోషేద్వారా దేవుడు ఇశ్రాయేలీయులకిట్లు చెప్పాడు : "నీవు నీ దేవుడైన యెహో

వాకు ప్రతిష్ఠిత జనము. నీ దేవుడైన యెహోవా భూమి మీదనున్న సమస్త జనములకంటె నిన్ను ఎక్కువగా ఎంచి నిన్ను తనకు స్వకీయ జనముగా ఏర్పరచు కొనెను" (ద్వితీ 7:6). "మరియు యెహోవా నీతో చెప్పినట్లు నీవే తనకు స్వకీయ జనమై యుండి తన ఆజ్ఞలన్నియు గైకొందు వనియు, తాను సృజించిన సమస్త జనముల కంటె నీకు కీర్తి ఘనత పేరు కలుగునట్లు నిన్ను హెచ్చించుదునని ఆయన సెలవిచ్చి నట్లు నీవు నీ దేవుడైన యెహోవాకు ప్రతిష్ఠిత జనమై యుందువనియు యెహోవా ఈ దినమున ప్రకటించెను" (ద్వితీ 26:18, 19).

దేవునికి చెందిన ప్రజలు అను చక్కని భావాన్ని పేతురు సంఘమునకు వర్తింప జేసాడు. ఈ క్రైస్తవ యుగంలో క్రీస్తు సంఘ స్థులు దేవుని సొత్తయిన ప్రజలై యున్నారు. ఇదే భావాన్ని తీతు 2:4లో కూడ పౌలు వ్యక్తపరచాడు: "ఆయన సమస్తమైన దుర్నీతి నుండి మనలను విమోచించి, సత్క్రియల యందాసక్తిగల ప్రజలను తన కోసరము పవిత్ర పరచుకొని తన సొత్తుగా చేసికొను టకు తన్ను తానే మనకొరకు అర్పించు కొనెను". క్రైస్తవులు దేవునికి చెందినవారు. వారాయన సొత్తు. ఆయన తన కుమారుని రక్తమునిచ్చి మనలను కొన్నాడు. ఆయన మనలను మార్చాడు. ఇంకా మార్చుచునే యున్నాడు. మీరు నిజముగా నా ప్రజలు అని ఆయన ప్రకటించు చున్నాడు. మనం దేవుని సొత్తయిన ప్రజలైనందువలన దేవునికి స్తోత్రము !

## ముగింపు

అందువలన క్రీస్తు సంఘము ఆత్మీయ ఇశ్రాయేలు అయ్యున్నది. గతంలో ఇశ్రాయేలీయులవలె నేడు మనం దేవుడు ఏర్పరచుకొన్న ప్రజలం. ఇశ్రాయేలు దేవుని పరిశుద్ధ జనాంగ మెట్లయ్యారో, అట్లే నేడు క్రీస్తు సంఘము దేవుని పరిశుద్ధ జనమై యున్నారు. వారెట్లు యాజకులో అట్లే నేడు మనమును రాజులు, యాజకులు. ఇశ్రాయే లీయులు ఎట్లు దేవుని సొత్తయిన ప్రజలో, నేడు మనమును అట్లే. క్రైస్తవ యుగంలో ఆయన సంఘమే ఆయన సొంత సొత్తు.

నీవు క్రైస్తవుడవు కానిచో దేవుడను గ్రహించు అతి శ్రేష్టమైన ఆశీర్వాదములను పోగొట్టుకొనుచున్నావు. దేవుడు తన సంఘానికిచ్చిన అధికత్యలను గమనించిన తరువాత నీవాయన సంఘములో సభ్యు డవు కాకుండ యుండగలవా?

✍ - ఎడ్డీ క్లోర్

❦ ❦ ❦

# క్రైస్తవునిగా ఎందుకు ఉండాలి?

## (Why one should be a Christian?)

సంక్షిప్త ప్రసంగము

(మత్తయి 7:21-24; కీర్తన 107:43)

**పరిచయం :**

1. ఒకడు క్రైస్తవుడుగా యుండుటకు అనేక కారణములున్నవి.
2. ప్రతివాడు క్రైస్తవునిగా యుండాలని కోరుకోవాలి.
3. దిగువకొన్ని మంచి కారణము లీయబడినవి.

**పాపి దేవుని కలసికొనుటకు అనర్హుడు గనుక క్రైస్తవుడుగా యుండాలి:**

పాపము వలన మానవుడు దేవుని నుండి వేరైపోయాడు (యెషయా 59:1-2). అందరు పాపము చేసినవారే (రోమా 3:23).

అందరు దేవుని నెదుర్కొనుటకు సిద్ధపడాలి (హెబ్రీ 9:27).

పరలోకంలో పాపము ప్రవేశింపజాలదు (ప్రక 21:7).

పాపము వలన వచ్చు జీతము మరణము (రోమా 6:23).

**దేవుడు రక్షణనను గ్రహించాడు గనుక క్రైస్తవుడుగా యుండాలి :**

మనం నశించినను దేవుడు ఇంకా మనలను ప్రేమించుచున్నాడు (ఎఫెసీ 2:4).

పాపలోకము కొరకు దేవుడు తన కుమారుని యిచ్చారు (యోహాను 3:16).

క్రీస్తు రక్తము అవసరమాయెను (హెబ్రీ 9:22).

క్రీస్తు రక్తము పాపమును నివారించును (మత్త 26:28).

పాపము నుండి పవిత్రులుగా చేయుటకు క్రీస్తు రక్తము చిందింపబడెను (1 యోహాను 1:7).

ప్రభువు తన సంఘమును స్వరక్తమిచ్చి కొనెను (అపొ.కా. 20:28).

**దేవుడు రక్షణనను గ్రహించు చున్నందున క్రైస్తవుడు కావాలి :**

క్రీస్తు సువార్తలో శక్తి సార్వజనికమైనది (మత్త 28:19-20).

ఆయన ఆహ్వానము అందరికీ ఇయ్యబడింది (మత్త 11:28; అపొ.కా. 10:34-35; యోహాను 1:11-12).

గొప్ప వాగ్దానముతో ఇయ్యబడినది (యెషయా 1:18; మార్కు 16:15-16).

దేవునికి లోబడు సమయము ఇదే (2 కొరింథీ 6:2).

**ఈ జీవితం అశాశ్వతం గనుక క్రైస్తవుడు కావాలి :**

ఈ జీవితం అశాశ్వతం గాని తదనంతరం శాశ్వతం, జీవము ఆవిరివంటిది (యాకోబు 4:13-15).

జీవం నీడవంటిది (యోబు 14:1-2) సర్వశరీరులు గడ్డినిపోలినవారు, పువ్వువంటివారు (1 పేతు 1:24). జీవన్మరణముల మధ్య ఒక్క అడుగు మాత్రమే యున్నది (1 సమూ 20:3) నిట్టూర్పులు విడుచుచు జీవితం గడుపుదుము (కీర్తన 90:9).

**క్రీస్తును విసర్జించు వారికి శిక్ష గనుక క్రైస్తవుడు కావాలి :**

దేవుని తీరు ఖచ్చితం (హెబ్రీ 9:27) తీర్పు దృశ్యం (మత్తయి 25:31-46).

నీతిమంతులు రక్షింపబడుటే దుర్లభము (1 పేతురు 4:17).

అవిధేయులు తప్పక శిక్షింపబడుదురు (2 థెస్స 1:7-9).

కలుగబోవు తీర్పు కొరకు భయముతో ఎదురుచూడవలసి వచ్చును (హెబ్రీ 10:26-27).

నీవు నిజంగా శిక్షకోరుకొనుచున్నావా?

**ముగింపు :**

నీవు క్రైస్తవుడవు కాకపోతే ఇప్పుడే క్రీస్తులోనికి ప్రవేశించు. క్రీస్తునందు విశ్వాసముంచు, పాపముల విషయమై మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందు (మార్కు 16:16; అపో.కా. 2:38).

ఆఖరి క్షణం వరకు కనిపెట్టవద్దు.

- థామస్ హర్టల్

**క్రీస్తు సంఘములు సమర్పించుచున్న సత్యవాణి టి.వి.**
**కార్యక్రమములను ప్రతి మంగళవారం ఉదయం 6:30 గం॥లకు**
**మా టి.వి. లోను మరియు ప్రతి శనివారం ఉదయం 6:30 గం॥లకు**
**తేజ ఛానల్‌లోను చూడండి.**

<u>గమనిక</u> : సత్యవాక్కు కావలసినవారు సంవత్సరమునకు 50/- రూ॥లు చందా విధిగా పంపించవలయును.

SATYA VANI, P.O. BOX-80, KAKINADA - 533 001.

వంతముగా నడిపించిరి. రాజుగారి కుమారుని జన్మదినాన్ని పురస్కరించుకొని వెంకట్రావు గారు చక్కటి వాక్యపరిచర్య చేసిరి. సోదరులు ఎస్. జాన్, కె. జయానంద్ గార్లు పాటలు నడిపించుటలోను, పి.వి.జి. రాజు, బి. శ్రీనివాస్ గార్లు వాక్యపఠనంలోను, పి.జీవరత్నంగారు ప్రార్ధన చేయుటలోను సహకరించిరి. కూటము అనంతరం వచ్చిన వారందరికీ మంచి విందు ఏర్పాటు చేయబడెను. కొప్పవరంలో క్రీస్తు సంఘము దిన దినము అభివృద్ధి జెందునట్లు ప్రార్ధించుదాం.

ఏప్రియల్ 12, 13, 14 తేదీలలో రామచంద్రపురం కుమ్మర వీధిలోని క్రీస్తు సంఘము ఏర్పాటు చేసిన బహిరంగ సువార్త కూటములు ఘనముగా జరిగెను. స్థానికులు పరిసర సంఘముల వారు పెక్కు సంఖ్యలో హాజరై దేవుని వాక్యము ప్రకటింప బడుచుండగా వినిరి. సోదరులు పి. సుందరరావ్, చిల్లా దేసింగ్ గార్లు కూటములన్నిటిలో కుటుంబ సమేతముగా హాజరై సహకరించిరి. 14వ తేదీ రాత్రి కూటమునకు జాషువా గారు సతీసమేతముగా హాజరై వాక్యపరిచర్య చేసిరి. కుమ్మర వీధిలో యున్న క్రీస్తు సంఘమునకు సోదరులు యన్. లాజరస్, వారి కుమారుడు ప్రసాద్ గార్లు వాక్యపరిచర్య చేయు చున్నారు.

ఏపియల్ 15వ తేదీ ఉదయం ఆరికి రేవులలో సోదరులు ఎ. విశ్వేశ్వర రావ్ గారి కుమార్తె వివాహము ఘనముగా జరిగెను. పలువురు సోదరులు ఆ వివాహములో పాల్గొనిరి. వధూవరులను అభినందించిరి.

ఏప్రియల్ 17వ తేదీ శనివారం సాయంత్రం ప్రత్తిపాడు మండలం దివిలిలో జరిగిన సువార్త కూటములో సోదరులు జాషువాగారు వాక్యపరిచర్య చేసిరి. అక్కడ సోదరులు డి. సీయోను గారు వాక్యపరిచర్య చేయు చున్నారు.

ఏప్రియల్ 20వ తేదీ రాత్రి గోరింటలో జరిగిన సువార్త కూటము, బైబిలు క్లాసులో సోదరులు జాషువా గారు సతీసమేతముగా హాజరై మంచి వాక్యపరిచర్య చేసిరి. గోరింటలో యున్న క్రీస్తు సంఘస్థులందరు హైందవులలో నుండి క్రీస్తులోనికి మారినవారే. అందరు ఆసక్తితో వాక్యమును వినిరి. ఆ కూటములో సోదరులు

యం.కృపానందం (రఘుదేవరపురం) గారు కూడ చక్కటి వాక్యపరిచర్య చేసిరి. గోరింటలో వారి కుమారుడు ప్రేమ్‌కుమార్ గారు పరిచర్య చేయుచున్నారు.

ఏప్రియల్ 25, 26, 27వ తేదీలలో రఘుదేవరపురంలో యున్న క్రీస్తు సంఘము సువార్త సభల నేర్పాటు చేసిరి. ఈ కూటములలో సోదరులు పి. సంజీవరావ్, జె.మణి కుమార్ (పెద్దాపురం), యం. ప్రేమ్‌కుమార్ (చదలాడ) గార్లు వాక్యపరిచర్య చేసిరి. సోదరులు స్థానిక సంఘ సువార్తికులు యమ్. కృపానందము గారు దేవుని గ్రంథము నుండి తగు రీతిగ హెచ్చరికల నిస్తు సంఘమును ప్రోత్సహించిరి. 26వ తేదీ నాడు సండే స్కూల్ ర్యాలి నిర్వహించ బడెను. సభలు జయప్రదముగా ముగించబడెను. సోదరులు బి. ధర్మరాజు (నల్లగొండ) గారి ప్రార్ధనతో సభలు ముగిసెను.

RNI Regd. No. 69973/98
Postal Regd. No. VM/KD/02

From:

SATYA VAKKU
P.O. Box 80,
Kakinada - 533 001

To

Edited & published by Joshua Gootam Printed by him at Satya Vani Publications, Sambhamurthy St. Kakinada-533 004.